E69 NEWS

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సప్ నెం:
9959812941-9949356387

తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :308 శుక్రవారం 16 అక్టోబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

# బీఎస్-7పై కేంద్రం బిగ్ అప్‌డేట్!




2 లో

- 2029 ఏప్రిల్ నుంచి కొత్త నిబంధనలు
- మూడు దశల్లో బీఎస్-7 అమలు
- వాహన కాలుష్య నియంత్రణే ప్రధాన లక్ష్యం
- హానికర ఉద్గారాల తగ్గింపునకు చర్యలు
- ప్రస్తుత వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేదు
- బీఎస్-6 వాహనాలపై ప్రభావం ఉండదన్న స్పష్టత

# మహిళా శక్తితో స్వర్ణాంధ్ర లక్ష్యం!

- 'స్వయం ఏపీ'తో మహిళలకు కొత్త భరోసా
- 10 లక్షల మంది మహిళలే లక్ష్యం
- డ్వాక్రా ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్
- 11 లక్షల సంఘాలు.. రూ.69 వేల కోట్ల టర్నోవర్
- ఏడాదిలో లక్ష మంది మహిళలు వ్యాపారవేత్తలుగా
- 5 లక్షల మంది పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే యత్నం
- పొదుపు నుంచి ఆదాయార్జన వైపు అడుగులు
- మహిళా శక్తితో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం



2 లో

**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** మహిళా సాధికారత, గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ 'సరస్ మేళా' 2026 కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఈ బ్రాండ్ ద్వారా మహిళా సంఘాల ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికలపై అందుబాటులోకి తీసుకురానున్నట్లు సీఎం చెప్పారు. జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు సభలో మాట్లాడారు.

'ఢిల్లీలో నిర్వహించే జాతీయ మహిళా సరస్ మేళాను తొలిసారిగా ఢిల్లీ వెలుపల విజయవాడలో నిర్వహించడం ఓ ప్రత్యేకత. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నారీశక్తికి, నవభారత శక్తికి ప్రతిరూపం. గ్రామీణ మహిళల ఆదాయాన్ని పెంచడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, గ్రామీణ ఉత్పత్తులకు విస్తృత గుర్తింపు తీసుకురావడమే సరస్ మేళా ప్రధాన ఉద్దేశం.

# నక్సలిజం గాయం

## 1,570 మంది బాధితులు!

- బస్తర్ వేదనకు ఆ సంఖ్యే నిదర్శనం
- నక్సలిజంతో గిరిజనులకు తీరని నష్టం
- బాధితులకు కృత్రిమ అవయవాల పంపిణీ
- జగదల్‌పూర్ శిబిరంలో 3,600 మందికి లబ్ధి
- బస్తర్‌లోనే 1,570 మందికి పైగా సాయం
- ఐదు దశాబ్దాలుగా నక్సలిజం ప్రభావం
- గిరిజనుల కష్టాలను చాటుతున్న గణాంకాలు
- 'సేవ సంకల్ప్ అభియాన్'తో బాధితులకు ఊరట

2 లో

# పాల ఉత్పత్తుల్లో కల్తీ గుట్టురట్టు!

- హైదరాబాద్‌లో అక్రమ డైరీ దందా గుట్టురట్టు
- ఆరు డైరీ యూనిట్లపై అధికారుల దాడులు
- అపరిశుభ్ర వాతావరణంలో పాల ఉత్పత్తులు
- లైసెన్సులు లేకుండానే యూనిట్ల నిర్వహణ
- బస్సులు, డీసీఎంలలో అక్రమ రవాణా
- 3.6 టన్నుల కల్తీ కోవా స్వాధీనం
- నిబంధనలు ఉల్లంఘించిన యూనిట్లు సీజ్
- పలువురికి షోకాజ్ నోటీసులు జారీ




2 లో

**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని డైరీ ప్రొడక్ట్స్ తయారీ కేంద్రాలపై టీజీ సేఫ్, ఫుడ్ వింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. క్వాలిటీని గాలికొదిలేసి నాసిరకం ఉత్పత్తులను విక్రయిస్తున్న డైరీ సంస్థల తీరు ఈ తనిఖీల్లో వెలుగుచూసింది. మధుర, యశోద, బాలాజీ, జగన్నాథ్ డైరీ ప్రొడక్ట్స్ కేంద్రాలపై అధికారులు ముమ్మరంగా సోదాలు జరిపారు. హైదరాబాద్ చుట్టుపక్కల మొత్తం 6 డైరీ యూనిట్లు, ఒక ట్రాన్స్‌పోర్ట్ కేంద్రంలో ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

# మతం మారితే బీసీ రిజర్వేషన్లు కట్!

- ఇస్లాంలోకి మారితే బీసీ రిజర్వేషన్లు వర్తించవు
- మద్రాస్ హైకోర్టు తీర్పుకు సమర్థన
- తమిళనాడు ప్రభుత్వ జీవో రద్దు
- ఏడు ముస్లిం శాఖల బీసీ గుర్తింపుపై వివాదం
- రిజర్వేషన్ల అర్హతపై స్పష్టత
- తమిళనాడు పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం
- బీసీ హోదాపై దేశవ్యాప్తంగా చర్చ

2 లో

# సింగరేణి ప్రైవేటీకరణపై క్లారిటీ

- సింగరేణి ప్రైవేటీకరణకు తావులేదు
- కార్మికులు ఆందోళన చెందొద్దు
- విపక్షాల ఆరోపణల్లో నిజం లేదు
- బీఆర్ఎస్‌పై శ్రీధర్‌బాబు ఫైర్
- సింగరేణిని జేబు సంస్థగా మార్చారని విమర్శ
- గత పాలనలో భారీగా బకాయిలు

2 లో



# దసరా దందా కోట్లు వసూలా!

**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** ఈ దసరా పండుగ సందర్భంగా అదనంగా సుమారు రూ.1000 కోట్లుపైగా సంపాదించాలని ఎక్సైజ్ శాఖ టార్గెట్ పెట్టుకున్నట్లు తెలిసింది. అందుకు అనుగుణంగా లిక్కర్‌ను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వైన్‌షాపుల ఓనర్లు రెగ్యూలర్ కొనుగోళ్లు కంటే అదనపు లిక్కర్ కోసం బేవరేజ్ కార్పొరేషన్‌ను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తున్నది. గత ఏడాది దసరా అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా రావడంతో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగలేదు. ఈసారి మాత్రం అంచనాలకు తగ్గట్టుగా విక్రయాలు ఉంటాయని అబ్కారీ శాఖ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

**15 రోజులుగా పెరిగిన సప్లయ్..**

రాష్ట్రంలో బోనాల పండుగ నుంచి లిక్కర్ సేల్స్ క్రమంగా పెరిగి, దసరా పండుగ నాటికి పీక్‌కు వెళ్తుంటాయి. ఈసారి కూడా జులై రెండోవారం (ఆషాఢ మాసం)నుంచి వైన్స్ విక్రయాలు పెరిగాయి. శ్రావణ మాసంలో కాస్త తగ్గినా మళ్లీ సెప్టెంబర్ మొదటి వారం నుంచి లిక్కర్ కొనుగోళ్లు పుంజుకున్నాయి.

మిగతాది 2 లో..

- దసరాకు వెయ్యి కోట్ల టార్గెట్
- వైన్‌షాపులకు పెరిగిన డిమాండ్
- అదనపు స్టాక్‌తో సిద్ధం
- బీర్ల సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు
- పల్లెలకు పెరిగిన జనసందడి
- సెలవులతో ఊపందుకున్న అమ్మకాలు
- గతేడాది రూ.700 కోట్ల విక్రయాలు
- ఈసారి భారీ అమ్మకాల అంచనాలు
- అక్రమ విక్రయాలపై నిఘా అవసరం

# ఇండియా కూటమికి సుప్రీం షాక్!



2 లో

**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. 'సర్' రద్దు చేయాలంటూ కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారించింది. అయితే రాహుల్ గాంధీ పాదయాత్రగా వెళ్లి పిటిషన్ వేయడంపై కూడా చర్చకు వచ్చింది. సుప్రీంకోర్టు ప్రాంగణం వరకు పాదయాత్రగా రావడంపై సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి సీజేఐ స్పందిస్తూ.. "మేము వాస్తవ ప్రపంచానికి అతీతులం కాదు. మాకు అన్ని విషయాలూ తెలుసు. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు." అని వ్యాఖ్యానించారు.

# సముద్రంలో ఐఫోన్లు.. ఏరుకుంటున్న జనం!




2 లో

**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** ట్రేడింగ్‌కు స్వర్గధామమైన హర్మూజ్ జలసంధి ప్రాంతంలో జరిగిన ఓ సముద్ర ప్రమాదం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. యూఏఈకి చెందిన ఓ కార్గో నౌక సముద్ర గనిని ఢీకొట్టి మునిగిపోవడంతో, అందులోని విలువైన వస్తువులు, ఐఫోన్లు సముద్రంలో తేలియాడాయి.

# సన్నబియ్యం ధరలకు రెక్కలు!

- 50 రోజుల్లో రూ.1,500కు పైగా పెరుగుదల
- ఎల్‌నినోతో మరింత పెరిగే అవకాశాలు
- నాణ్యమైన బియ్యానికి పెరిగిన డిమాండ్
- సన్నరకం వడ్ల సాగుకు రైతుల మొగ్గు
- మద్దతు ధర కంటే ఎక్కువ చెల్లింపులు
- అక్రమ నిల్వలపై తనిఖీలు చేపట్టాలని డిమాండ్



**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** సన్నబియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. 50 రోజుల వ్యవధిలో బియ్యం ధరలు రూ.1,500లకు పైగా పెరిగాయి. ఎల్‌నినో కారణంగా ఈ ధరలు మరింతగా పెరుగుతాయని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేసిన తొలినాళ్లలో సన్నబియ్యం ధరలు దిగివచ్చాయి. ఆ తర్వాత మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. వర్షాలు తక్కువగా కురవడం, ఎల్‌నినో కారణంగా భిన్నమైన వాతావరణ పరిస్థితులను చూస్తున్నాం.

2 లో

# అభిజీత్ దిప్కేకు మేరీ మిల్బెన్ చురకలు!




2 లో

- అమెరికా నిధుల ఆరోపణలపై స్పందన
- చట్టాన్ని ఉల్లంఘించే శక్తులకు హెచ్చరిక
- దేశ ప్రగతికి కృషి చేయాలని హితవు
- మోదీ నాయకత్వాన్ని కొనియాడిన గాయని
- 150 కోట్ల మంది ప్రజలే మోదీకి బలమని వ్యాఖ్య
- 2029 ఎన్నికల్లోనూ మోదీకే మద్దతని ధీమా

తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

శుక్రవారం,
16 అక్టోబర్ 2026



# సముద్రంలో ఐఫోన్లు.. ఏరుకుంటున్న జనం!

**మొదటి పేజీ తరువాయి**

సింగపూర్ ఫ్లాగ్‌తో ప్రయాణిస్తున్న జీఎఫ్ఎస్ ప్రైడ్ అనే కంటైనర్ నౌక దుబాయ్ నుంచి వస్తువులను తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ నౌకలో ఐఫోన్లు, లగ్జరీ పెర్ఫ్యూమ్ బాటి, ఇతర ఖరీదైన వస్తువులతో కూడిన దాదాపు 2,500 కంటైనర్లు ఉన్నట్లుగా సమాచారం.

వైరల్ అవుతున్న వీడియోలు..

ప్రమాదం తర్వాత సముద్రంలో ఐఫోన్ బాక్సులు, పెర్ఫ్యూమ్ సీల్డ్ ప్యాకెట్స్ నీటిపై తేలియాడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. చిన్న పడవలపై వచ్చిన స్థానికులు నీటిలో తేలుతున్న ఆ ఖరీదైన వస్తువులను ఏరుకుంటున్న వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. అయితే, ఈ ప్రమాదంలో నౌకలోని 21 మంది సిబ్బందిని సకాలంలో సురక్షితంగా రక్షించినట్లుగా సింగపూర్ సముద్ర, ఓడరేవు అధికార వర్గాలు వెల్లడించాయి.

# నక్సలిజం గాయం..1,570 మంది బాధితులు!



**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ రథసారధిగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 'సేవ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. ఇవాళ ఢిల్లీ నుంచి జూమ్ మీటింగ్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ బాధితులు, ఇతర దివ్యాంగులతో మాట్లాడిన ఆయన, నక్సలిజం మూలంగా వైకల్యం బారినపడిన గిరిజనులకు ఈ అభియాన్ కింద కృత్రిమ అవయవాలను అందిస్తుండటం పట్ల తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు.

బస్తర్‌లో పెరిగిన లబ్ధిదారులే నిదర్శనం..

ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. అక్టోబర్ 5 నుంచి 7 వరకు జగదల్‌పూర్ లో నిర్వహించిన స్పెషల్ క్యాంప్ ద్వారా ఏకంగా 3,600 మందికి పైగా దివ్యాంగులు లబ్ధి పొందారని అమిత్ షా తెలిపారు. కేవలం బస్తర్ ప్రాంతంలోనే 1,570 మందికి పైగా బాధితులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందారని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ సంఖ్యే బస్తర్ పడుతున్న వేదనను, బాధను స్పష్టంగా దేశానికి తెలియజేస్తోందని అన్నారు. గత ఐదు దశాబ్దాలుగా తీవ్ర రూపం దాల్చిన నక్సలిజం వల్ల బస్తర్‌లోని నిరుపేద గిరిజనులు ఏ విధంగా దెబ్బతిన్నారో ఈ గణాంకాలే యావత్ ప్రపంచానికి చాటిచెబుతున్నాయని అమిత్ షా స్పష్టం చేశారు.

# ఇండియా కూటమికి సుప్రీం షాక్!

**మొదటి పేజీ తరువాయి**

సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాజకీయ ఊరేగింపు నిర్వహించడాన్ని సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది ఆమోదయోగ్యం కాదని అన్నారు. న్యాయవ్యవస్థను బెదిరించి, ఒత్తిడి తెచ్చే ప్రయత్నంగా అభివర్ణించారు. న్యాయవాది వ్యాఖ్యలకు ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని.. ఇటువంటి ప్రయత్నాలు చాలా బలహీనమైనవని, వాటిని ఎవరూ పట్టించుకోరని సూర్యకాంత్ అన్నారు. తాము వాస్తవ ప్రపంచానికి దూరంగా కూర్చోలేదని.. తమకు అన్నీ తెలుసని చెప్పారు.

ఇక జంతర్ మంతర్ విషయమై సుప్రీంకోర్టు ఆదేశం మేరకు దానిని నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించలేదని ఎస్జీ తుషార్ మెహతా పేర్కొన్నారు. ఒక కమిటీ ఆ సూచన చేసిందని తెలిపారు. నిరసన ప్రదేశాల జాబితా నుంచి జంతర్ మంతర్‌ను తొలగిస్తూ ఢిల్లీ పోలీసులు జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోర్టు నోటీసు జారీ చేసింది. తాము ముందుగా ప్రభుత్వ స్పందనను వింటామని, సంతృప్తి చెందకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు పేర్కొంది.

# సింగరేణి ప్రైవేటీకరణపై క్లారిటీ



**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** సింగరేణి సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించబోతున్నామంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని శాఖ మంత్రి శ్రీధర్ బాబు తేల్చి చెప్పారు. సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయబోమని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. గత పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం ఒక 'జేబు సంస్థ'గా మార్చుకుందని ఆరోపించారు. అంతేకాకుండా, సింగరేణికి భారీగా బకాయిలు పెట్టి సంస్థను ఆర్థికంగా దెబ్బతీసింది కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మండిపడ్డారు. అలాంటి బీఆర్ఎస్ నాయకులకు ఈరోజు సింగరేణి కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడే హక్కు లేదని వ్యాఖ్యానించారు.

అనవసర ఆరోపణలను నమ్మవద్దు..

సింగరేణి సంస్థను దెబ్బతీసి, దానికి చెడ్డపేరు తీసుకురావడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని, వారు చేస్తే అనవసర ఆరోపణలు, విమర్శలను ప్రజలు, సింగరేణి కార్మికులు పట్టించుకోవాల్సిన అవసరం లేదని పిలుపునిచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను కూడా పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# మతం మారితే బీసీ రిజర్వేషన్లు కట్!



**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** హిందూ సామాజికవర్గం నుంచి ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తి వెనుకబడిన తరగతుల (బీసీ) రిజర్వేషన్లకు ఎట్టి పరిస్థితుల్లో అర్హులు కాబోరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో మద్రాస్ హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఈ కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ శ్రీ చంద్రశేఖర్ లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు స్పష్టమైన తీర్పును వెలువరించింది. వాదనల సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.. హిందూ సామాజిక వ్యవస్థ నుంచి హిందూయేతర సామాజిక వ్యవస్థలోకి మారిన ఏ వ్యక్తి కూడా బీసీ రిజర్వేషన్ ప్రయోజనాలను క్లెయిమ్ చేయడానికి వీలుపడని అంశమని, అలాంటి వాళ్లందిరిక ఈ తీర్పులు వర్తిస్తుందని అని పేర్కొన్నది.

కాగా, వెనుకబడిన తరగతులకు చెందిన ముస్లింలలో 7 శాఖల వారికి బీసీ గుర్తింపునిస్తూ తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గతంలో మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది. వెనుకబడిన తరగతుల నుంచి ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తులను 'బీసీ ముస్లింలు'గా పరిగణించేలా తమిళనాడు ప్రభుత్వం తెచ్చిన జీవోను హైకోర్టు తప్పుపట్టింది. హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. తాజాగా సర్వోన్నత న్యాయస్థానం కూడా హైకోర్టు తీర్పును సమర్థిస్తూ తుది తీర్పును వెలువరించింది.

# అభిజీత్ దిప్కేకు మేరీ మిల్బెన్ చురకలు!



**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** కాక్రోచ్ జనతా పార్టీ కీలక నేత అభిజీత్ దిప్కేను ఉద్దేశించి ప్రముఖ అమెరికన్ గాయని మేరీ మిల్బెన్ సోషల్ మీడియా వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో జరుగుతున్న నిరసనలు, అమెరికా నిధుల ఆరోపణల నేపథ్యంలో 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా స్పందించిన ఆమె.. "నిజం ప్రతి ఒక్కరినీ విముక్తులను చేస్తుంది. చివరకు నిన్ను కూడా" అంటూ నేరుగా చురకలంటించారు. మీరు చేసే ప్రయత్నాల్లో విజయం సాధించకపోతే ఈ అమెరికన్ డోనర్లు వేడి జిలేబీని పడేసినట్లు మిమ్మల్ని పక్కన పెట్టేస్తారన్నది నగ్న సత్యమని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే అరాచక శక్తులు ఎప్పటికీ గెలవలేవని స్పష్టం చేసిన ఆమె.. అమెరికాలో పొందిన విద్య, ప్రతిభను దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి కాకుండా మంచి పనులకు ఉపయోగించాలని హితవు పలికారు. ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి కూర్చుని దేశ ప్రగతికి సానుకూల గళంగా మారాలని, సరైన నిర్ణయం తీసుకోవడంలోనే మీ ధైర్యం ఆధారపడి ఉందని దిప్కేకు సూచించారు.

ఇదే క్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వానికి ఉన్న ప్రజాదరణను మేరీ మిల్బెన్ కొనియాడారు. ప్రధానమంత్రి మోడీకి అమెరికా వంటి దేశాల మద్దతు ఏమాత్రం అవసరం లేదని, ఆయన వెనుక 150 కోట్ల మంది భారతీయ పౌరుల అండదండలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. గత 25 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉంటూ, వరుసగా మూడు పర్యాయాలుగా 12 ఏళ్ల పాటు ప్రధానిగా దేశాన్ని నడిపిస్తున్న మోడీకి భారత ప్రజలే బలమని కొనియాడారు. అంతేకాకుండా, రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ దేశ ప్రజలు ముమ్మాటికీ నరేంద్ర మోడీకే మద్దతు పలికి గెలిపిస్తారని, ఇదే అసలైన నిజమని మిల్బెన్ స్పష్టం చేశారు. విదేశీ శక్తుల కనుసన్నల్లో సాగే ఉద్యమాలు ప్రజాస్వామ్యంలో నిలబడలేవని ఆమె తన ట్వీట్ ద్వారా తేల్చిచెప్పారు.

# బీఎస్-7పై కేంద్రం బిగ్ అప్‌డేట్!

**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** దేశవ్యాప్తంగా వాహన కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా వచ్చే కార్లు, ఎస్‌యూవీ ల కోసం మరింత కఠినమైన 'భారత్ స్టేజ్-7 (BS-VII) ఉద్గార ప్రమాణాలను తీసుకురావడానికి రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ కొత్త నిబంధనలను 2029 ఏప్రిల్ 1 నుంచి 2035 ఏప్రిల్ 1 వరకు ఆరేళ్ల కాల వ్యవధిలో మూడు విడతలుగా అమలు చేయనున్నట్లుగా మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అందులో మొదటి దశ ఏప్రిల్ 2029 నుంచి, రెండో దశ ఏప్రిల్ 2031 నుంచి, మూడో దశ ఏప్రిల్ 2035 నుంచి అమల్లోకి రానున్నాయి.

ప్రస్తుత వాహనదారులకు నో ప్రాబ్లం..

నైట్రోజన్ ఆక్సైడ్స్, హైడ్రోకార్బన్లు, పార్టిక్యులేట్ మేటర్ వంటి హానికరమైన కాలుష్య కారకాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ బీఎస్-7 నిబంధనలను రూపొందించారు. అయితే, ఈ నిర్ణయం వల్ల ప్రస్తుతం రోడ్లపై తిరుగుతున్న వాహనాలకు గానీ, బీఎస్-6 (BS-VI) ప్రమాణాలు కలిగిన వాహనాల జీవితకాలానికి గానీ ఎలాంటి ముప్పు ఉండదని అధికారులు స్పష్టం చేశారు. కాగా, దేశంలో కాలుష్య నివారణను వేగవంతం చేసేందుకు భారత్ గతంలో 'బీఎస్-5'ను దాటవేసి నేరుగా 'బీఎస్-6' నిబంధనలను ఏప్రిల్ 2020 నుంచి అమలులో?కి తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

# సన్నబియ్యం ధరలకు రెక్కలు

**మొదటి పేజీ తరువాయి**

దానితో పాటు రేషన్ బియ్యాన్ని చాలా మంది తినడం లేదు. దీంతో నాణ్యమైన సన్నబియ్యానికి డిమాండ్ ఏర్పడింది.

నియంత్రణ పై దృష్టి పెడితే..

బియ్యం ధరల పై ప్రభుత్వంతో పాటు ధరల నియంత్రణ కమిటీలు కూడా కీలకంగా పనిచేయాల్సి ఉంటుంది. కేవలం 50 రోజుల్లోనే ధరలు ఈ విధంగా పెరిగిపోతే భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితి ఉంటుందో ఊహించుకోవచ్చు. జిల్లాకేంద్రంలో కొందరు వ్యాపారులు సన్నబియ్యాన్ని రహస్యంగా నిల్వ చేసుకున్నారని ప్రచారం జరుగుతోంది. అధికారులు అక్రమ నిల్వలను గుర్తించడానికి తనిఖీలు చేస్తే ధరల పెరుగుదలను నియంత్రించే అవకాశాలు ఉంటాయి. కొనుగోలుదారులు వ్యాపారుల నుంచి బిల్లులను తీసుకుంటే మంచిది.

సన్నాలకు డిమాండ్..

ప్రభుత్వం సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ అందజేస్తుంది. దీంతో చాలా మంది రైతులు సన్నాలను సాగు చేస్తున్నారు. అయితే ఈ ఖరీఫ్ సీజన్‌లో వ్యాపారులు, మిల్లర్లు సన్నరకం ధాన్యాన్ని కల్లాల వద్దే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కంటే ఎక్కువగా చెల్లిస్తున్నారు. దీంతో సన్నాలకు డిమాండ్ ఏర్పడింది. అధిక మొత్తం చెల్లించైనా సన్నాలను కొనుగోలు చేయడానికి ముందుకు వస్తున్నారు. దీంతో ఈ ఏడాది సన్నరకం బియ్యం వ్యాపారులు, మిల్లర్ల వద్దకే వెళ్లే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్ సమస్యలతో చాలా చోట్ల పంటలు ఎండిపోతున్నాయి. ఈ ప్రభావంతో దిగుబడులు తగ్గనున్నాయి. సామాన్యులకు అందుబాటు ధరల్లో బియ్యం లభించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పాల ఉత్పత్తుల్లో కల్తీ గుట్టురట్టు!

**మొదటి పేజీ తరువాయి**

ఈ సోదర్లలో అపరిశుభ్ర వాతావరణంలో డైరీ ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు తేలింది. ఎలాంటి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేకుండానే గుట్టుచప్పుడు కాకుండా ఈ యూనిట్లు నడుస్తున్నట్లు గుర్తించారు. సరైన నిల్వ వసతులు లేకపోవడంతో పాటు, ఉష్ణోగ్రత నియంత్రణ పాటించకుండా డైరీ ప్రొడక్ట్స్‌ను నిల్వ చేస్తున్నారు. కోల్డ్ స్టోరేజ్ వాహనాలను ఉపయోగించకుండా, ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి బస్సులు, డీసీఎంల ద్వారా హైదరాబాద్‌కు అక్రమ రవాణా చేస్తున్నట్లు అధికారులు తేల్చారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తున్న 3.6 టన్నుల కల్తీ కోవాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన పలు డైరీ యూనిట్లను సీజ్ చేయడంతో పాటు, మరికొన్నింటికి షోకాజ్ మరియు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు.

# మహిళా శక్తితో స్వర్ణాంధ్ర లక్ష్యం!

**మొదటి పేజీ తరువాయి**

మహిళలు ఆర్థికంగా ఎదిగితే వారి కుటుంబాలతో పాటు సమాజం, దేశం కూడా అభివృద్ధి చెందుతాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యం ఆరు కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి దీదీ'లుగా తీర్చిదిద్దడమే. మహిళలు కేవలం పొదుపు చేసే స్థాయి నుంచి ఆదాయం సంపాదించే వ్యాపారవేత్తలుగా ఎదగాలి' అని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

'గతంలో పొదుపు సంఘాలుగా ప్రారంభమైన మహిళా సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా అభివృద్ధి చెందాయి. భవిష్యత్తులో ఇవే అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన డ్వాక్రా పొదుపు ఉద్యమం దేశం గర్వించే స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు రూ.69 వేల కోట్ల టర్నోవర్‌తో పనిచేస్తున్నాయి. ఏడాది కాలంలో లక్ష మంది స్వయం సహాయక సంఘాల మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాము. ఐదు లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు కృషి చేస్తున్నాము. దీర్ఘకాలిక లక్ష్యంగా 10 లక్షల మంది మహిళలను ఎంటర్‌ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పనిచేస్తుంది' అని సీఎం వివరించారు.

'ఏపీలో మహిళా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు స్వయం ఏపీ బ్రాండ్ తీసుకువచ్చాం. ఈ-కామర్స్, ఆన్ లైన్ షాపింగ్లో స్వయం ఏపీ పేరుతో ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి. సంక్షేమంతో పాటు మహిళలకు భరోసా ఇచ్చేలా వారి సాధికారిత కోసం పనిచేస్తున్నాం. మహిళా శక్తిని బలోపేతం చేసేలా తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీశక్తితో ఉచిత బస్సు ప్రయాణంతో 100 కోట్ల ప్రయాణాలు మహిళలు చేశారు. సంక్షేమ పథకమైనా, అభివృద్ధి కార్యక్రమం అయినా మహిళల పేరుతోనే అమలు చేస్తున్నాం. ప్రతీ మహిళకు వెల్ఫేర్ టు వెల్త్ అందాలనేది మా నినాదం. సేవింగ్ మనీ స్థాయి నుంచి మేకింగ్ మనీ స్థాయికి మన ఎస్హెచ్జీ బృందాలు అభివృద్ధి చెందాయి. దేశంలోని ప్రతీ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ భారత్ దేశాన్ని ఆర్థిక శక్తిగా మార్చటంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తుంది. మహిళలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ భద్రత కల్పించటంతో పాటు సాధికారిత దిశగా ఏపీ పనిచేస్తోంది. ఎస్ హెచ్ జీల సాయంతో స్వర్ణాంధ్ర 2047 కలను సాకారం చేసేలా ముందుకు వెళ్తున్నాం. ప్రతీ ఎస్ హెచ్ జీ ఓ ఆర్థిక శక్తిగా, ప్రతీ మహిళా పారిశ్రామికవేత్తగా, ప్రతీ గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలన్నదే మా ఆలోచన' అని సీఎం చెప్పుకొచ్చారు.

# దసరా దందా.. కోట్లు వసూలా!

**మొదటి పేజీ తరువాయి**



దసరా పండగ నాటికి మరింత ఊపందుకుంటుదని ఎక్సైజ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే లిక్కర్ షాపు ఓనర్లు ప్రతి నెలలో కొనుగోలు చేసే మొత్తం కంటే అదనపు లిక్కర్‌ను బేవరేజ్ కార్పొరేషన్ నుంచి సేకరిస్తున్నట్టు చెప్తున్నారు. అందుకోసం అదనపు రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలుస్తున్నది. దసరా సీజన్‌లో మందుతోపాటు బీర్ల సేల్స్ కూడా రెండింతలు పెరగటం సహజం. దీనితో నెల రోజుల క్రితం నుంచి బీర్ల ఉత్పత్తిని డబుల్ చేసినట్టు తెలిసింది. గత ఏడాది దసరా పండుగ, గాంధీ జయంతి (అక్టోబరు2) ఒకేరోజు రావడంతో ఆశించిన స్థాయిలో మద్యం విక్రయాలు జరగలేదు. అయినా సుమారు రూ.700 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఈసారి మాత్రం రూ. 1000 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు ఉంటాయని ఎక్సైజ్ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఆదివారం నుంచి పండుగే..

స్కూళ్లకు సెలవులు ఇవ్వడంతో మెజార్టీ మంది సొంత ఊర్లకు వెళ్లారు. ఈ ఆదివారం నుంచే గ్రామాల్లో మద్యం విక్రయాల్లో పెరుగుదల ఉందని, దసరా పండుగ నాటికి డబుల్, త్రిబుల్ స్థాయిలో అమ్మకాలు ఉంటాయని లిక్కర్ షాపుల ఓనర్లు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో 2600 పైగా వైన్ షాపులు ఉన్నాయి. వాటికి అనుబంధంగా పర్మిట్ రూమ్స్ ఉన్నాయి. వీటికి తోడు ప్రతి గ్రామంలో రెండు మూడు బెల్ట్ షాపులు ఉన్నాయి. దీనితో మద్యం విక్రయించే షాపులు (వైన్ షాపులు, బార్లు, బెల్ట్ షాపులు) కలుపుకుని సుమారు పదివేల వరకు ఉంటాయని అనధికారికవర్గాల అంచనా. 'మంగళవారం దసరా పండుగ ఉంది. పండుగకు రెండు రోజుల ముందు నుంచే గ్రామాల్లో పండుగ వాతావరణం మొదలవుతోంది. పండుగ తెల్లారి కూడా విక్రయాలు ఎక్కువగా ఉంటాయి' అని వైన్‌షాపు ఓనర్ల అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి.

# ఢిల్లీ నిరసనలపై సుప్రీం కొరడా!

**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** దేశ రాజధాని ఢిల్లీలో అక్టోబర్ 10న జరిగిన భారీ నిరసనలు, ఆందోళనకారుల నిర్బంధంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై సుప్రీంకోర్టు గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతియుత నిరసనకారులు, జర్నలిస్టులు, న్యాయవాదులపై పోలీసుల దాడులు, అక్రమ నిర్బంధాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన అత్యున్నత న్యాయస్థానం.. నిరసనలకు సంబంధించిన అన్ని సీసీటీవీ దృశ్యాలను తక్షణమే భద్రపరిచి న్యాయస్థానానికి సమర్పించాలని అన్ని దర్యాప్తు సంస్థలను ఆదేశించింది. అలాగే జంతర్ మంతర్‌ను నిరసన వేదిక జాబితా నుంచి తొలగిస్తూ ఢిల్లీ పోలీసులు తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆందోళనకారుల ప్రాథమిక హక్కుల వాదనపై ధర్మాసనం స్పందిస్తూ.. "ప్రభుత్వానికి తమ స్వరం వినిపించాలనే ఆలోచనను నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కూడా సాకారం చేసుకోవచ్చు" అని జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ ధర్మాసనం వ్యాఖ్యానించింది.

మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, 'ఇండియా' కూటమికి చెందిన 13 మంది అగ్రనేతలు ఈసీఐ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఓట్ల తొలగింపును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలకు న్యాయస్థానం నోటీసులు పంపింది. అయితే, ఈ పిటిషన్ వేసిన 13 మంది ఇండియా కూటమి నేతల్లో ఒకరి ప్రవర్తనపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సదరు పిటిషనర్ ప్రవర్తనపై వివరణ కోరతామని స్పష్టం చేస్తూనే, ఓటర్ల జాబితా అక్రమాలపై ఈసీఐ తన స్పందనను తెలియజేయాలని ఆదేశించింది.

# హాఫ్ మారథాన్.. వరంగల్, హన్మకొండలో ట్రాఫిక్ ఆంక్షలు!

## అక్టోబర్ 17న ఉదయం 4 గంటల నుంచి 10 గంటల వరకు ఆంక్షలు

## ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలి: పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

**తెలుగు గళం వరంగల్, అక్టోబర్ 15**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 17న నిర్వహించనున్న హాఫ్ మారథాన్ పరుగు నేపథ్యంలో వరంగల్, హన్మకొండ, కాజీపేట ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.శనివారం ఉదయం 4 గంటల నుంచి 10 గంటల వరకు పలు ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలను మళ్లించడంతో పాటు కొన్ని మార్గాల్లో వాహనాల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించారు.ప్రయాణికులు పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ప్రత్యామ్నాయ మార్గాలు ఇవే..

హైదరాబాద్ నుంచి హన్మకొండకు వచ్చే వాహనాలు, బస్సులు ఫాతిమా సెంటర్ నుంచి మదర్ థెరిసా సెంటర్ మీదుగా ఎడమవైపు తిరిగి వడ్డేపల్లి చర్చి, తులసి బార్, కేయూసీ జంక్షన్, నయీంనగర్, సీపీఓ జంక్షన్ మీదుగా హన్మకొండ బస్టాండ్‌కు చేరుకోవాలి.హన్మకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు, బస్సులు అశోక జంక్షన్ మీదుగా ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ, కేయూసీ, తిరుమల బార్, వడ్డేపల్లి చర్చి, ఫాతిమా సెంటర్, కాజీపేట మీదుగా వెళ్లాలి.హన్మకొండ నుంచి కరీంనగర్‌కు వెళ్లే వాహనాలు అశోక జంక్షన్, ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ మీదుగా కేయూసీ మార్గంలో వెళ్లాలి.ఖమ్మం నుంచి హన్మకొండకు వచ్చే వాహనాలు, బస్సులు సీఎస్ఆర్ గార్డెన్ జంక్షన్ వద్ద మళ్లింపు తీసుకుని పోతన జంక్షన్ మీదుగా హన్మకొండకు చేరుకోవాలి.

ఈ మార్గాల్లో వాహనాలకు అనుమతి లేదు



ఈ నెల 17న ఉదయం 4 గంటల నుంచి 10 గంటల వరకు సీఎస్ఆర్ గార్డెన్ జంక్షన్ నుంచి అదాలత్ వైపు, అంబేద్కర్ జంక్షన్ నుంచి కాలేజీ జంక్షన్ వరకు, ఫాతిమా జంక్షన్ నుంచి ఎన్ఐటీ వైపు ఎలాంటి వాహనాలను అనుమతించరు.అలాగే 100 ఫీట్ల రోడ్డుపై ఒకవైపు మాత్రమే వాహనాల రాకపోకలకు అనుమతి ఉంటుంది.మారథాన్ నిర్వహణకు సహకరించాలని, ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణ ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసుకోవాలని పోలీసులు సూచించారు.

# సద్దుల బతుకమ్మకు బెస్తంచెరువు ముస్తాబు..

**ఏర్పాట్లపై మాజీ కార్పొరేటర్ సమీక్ష**
**మహిళలకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలి: గుండు చందన పూర్ణచందర్**

తెలుగు గళం న్యూస్, వరంగల్ అక్టోబర్ 15



సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు రంగషాయిపేటలోని బెస్తంచెరువు వద్ద ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.పండుగకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని 42వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ అధికారులకు సూచించారు.గురువారం ఆయన బెస్తంచెరువు ప్రాంతాన్ని సందర్శించి, పండుగ నిర్వహణ కోసం చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు మైదానంతోపాటు పరిసర ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి, ఇతర ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సద్దుల బతుకమ్మ వేడుకలకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అన్నారు. ఉరుసు బైపాస్ రోడ్డు వైపు వెళ్లే మెటల్ రోడ్డు, ఖమ్మం రోడ్డు నుంచి నాయుడు పంపు వైపు వెళ్లే మెటల్ రోడ్లపై డస్ట్ చల్లించే పనులు చేపట్టినట్లు తెలిపారు.పండుగ సమయంలో రాత్రివేళ కూడా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో లైటింగ్, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి, పండుగకు వచ్చే మహిళలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఏర్పాట్లు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహారాములు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ భీమయ్య, శానిటరీ జవాన్లు అశోక్, ప్రణీత్, ప్రశాంత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# బౌద్ధనగర్ డివిజన్‌లో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవతో పెండింగ్ పనులకు మోక్షం: మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**

తెలుగు గళం న్యూస్ సికింద్రాబాద్, అక్టోబర్ 15



సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని బౌద్ధనగర్ డివిజన్‌లో సుమారు రూ.5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ తెలిపారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవతో డివిజన్‌లో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులకు మార్గం సుగమమైందని ఆమె పేర్కొన్నారు.ఈ మేరకు అక్టోబర్ 14న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, ఇతర అంశాలపై చర్చించినట్లు స్వరూప గౌడ్ వెల్లడించారు.బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని అంబర్‌నగర్, పార్సిగుట్ట, బౌద్ధనగర్, అశోక్‌నగర్, ఎల్. నారాయణ నగర్, వారసిగూడ తదితర బస్తీలలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే డ్రైనేజీ పైప్‌లైన్ల మరమ్మతులు, కమ్యూనిటీ హాళ్ల పునరుద్ధరణ, పవర్ బోర్ల మరమ్మతులు, కొత్త నీటి ట్యాంకుల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.అదేవిధంగా తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను మార్చడంతో పాటు కొత్త కేబుల్ వైర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పనుల ద్వారా డివిజన్‌లోని పలు బస్తీల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయని తెలిపారు.గత కొన్ని నెలలుగా డివిజన్‌లోని అన్ని బస్తీల్లో బస్తీ కమిటీ అధ్యక్షులతో కలిసి పాదయాత్రలు నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించినట్లు స్వరూప గౌడ్ తెలిపారు. ఆయా సమస్యలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అధికారుల ద్వారా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేసినట్లు వివరించారు.గతంలో తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో డివిజన్‌లో రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర మంత్రి సహకారంతో మరోసారి డివిజన్ అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.బౌద్ధనగర్ డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి స్వరూప గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఓటు మన ఆయుధం--బతుకమ్మ మన ఐక్యత

**• ఐద్వా, టీపీఎస్‌కే, టీఎంకేఎంకేఎస్, మత్స్య మహిళా కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు**

తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, అక్టోబర్ 15




"ఓటు మన ఆయుధం -- బతుకమ్మ మన ఐక్యత" అనే నినాదంతో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు ఐద్వా, టీపీఎస్‌కే, టీఎంకేఎంకేఎస్, మత్స్య మహిళా కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.మహిళల ఐక్యత, ఆత్మగౌరవం, సమాన హక్కులు, పర్యావరణ పరిరక్షణ అంశాలపై నాయకులు ఈ సందర్భంగా ప్రసంగించారు.ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని అన్నారు.మహిళలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని, రాబోయే ఎన్నికల్లో ప్రతి మహిళ తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్యంలో ఓటు మహిళల చేతిలో ఉన్న శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు.మత్స్య మహిళా కార్మిక సంఘం రాష్ట్ర నాయకురాలు బక్కి బాలమణి మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఫ్యాక్టరీల నుంచి వెలువడే కాలుష్యాన్ని నివారించాలని, చెరువులు, సముద్రాలు కలుషితం కాకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జలవనరుల పరిరక్షణతోనే మత్స్యకారుల జీవనోపాధికి, ప్రజల ఆరోగ్యానికి భద్రత కలుగుతుందని పేర్కొన్నారు.టీపీఎస్‌కే నాయకురాలు సరిత మాట్లాడుతూ..ఆడపిల్లలను పుట్టనివ్వాలని, ఎదగనివ్వాలని, చదివించాలన్నారు. ఆడపిల్లలు ఆకాశంలో సగం, సమాజంలో సగమని పేర్కొంటూ విద్య, ఉద్యోగం, ఉపాధి సహా అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.మహిళల పట్ల వివక్షను తొలగించి, బాలికల హక్కులను పరిరక్షించేందుకు సమాజమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ మత్స్యకారుల మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ్మ, తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షురాలు సుజావతి, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణా జ్యోతి, ఆశాలత, గాండ్ల అమరావతి, సౌళ్ల లలిత పుష్ప, రజినీ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

# కలాం జయంతి సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాల పంపిణీ

**• మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు**

హన్మకొండ, అక్టోబర్ 15 (తెలుగు గళం న్యూస్)




భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జన్మదినాన్ని పురస్కరించుకుని హన్మకొండ జిల్లాలోని దివ్యాంగుల వసతి గృహంలో మొక్కలు నాటడంతో పాటు విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేశారు.డిసేబుల్ స్టూడెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వసతి గృహ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సందేశాన్ని అందించారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాలను అందజేశారు. విద్యార్థులు చదువులో రాణించి, ఉన్నత లక్ష్యాలను సాధించి తమ జీవితాల్లో స్థిరపడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.విద్య ద్వారానే ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం అందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి తమ వంతు సహకారం అందించడమే ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసేబుల్ స్టూడెంట్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ యాకుబ్ పాషా, సంస్థ సభ్యులు రాంబాబు, సంతోష్, సందీప్, సురేందర్, శ్రీశైలం, రాజు, నితిషీతో పాటు దివ్యాంగుల వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి!

**బతుకమ్మ--దసరా పండుగలకూ వేతనాలు లేక పస్తులుండాల్సిందేనా?**
**ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికుల సమస్యలను పరిష్కరించాలి: సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపర్తి రాజు**

జనగామ, అక్టోబర్ 15 (తెలుగు గళం)



గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాలేదనే కారణంతో ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలు నిలిపివేయడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ, దసరా వంటి పండుగల సమయంలోనూ వేతనాలు అందక కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావడం బాధాకరమన్నారు.ఈ సమస్యపై రఘునాథపల్లి మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జనగామ జిల్లా పంచాయతీ అధికారి వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి, పెండింగ్ వేతనాలు ఉన్న గ్రామపంచాయతీ కార్మికులకు వాటిని అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ, గ్రామాల పరిశుభ్రత, చెత్త సేకరణ, మురుగుకాలువల శుభ్రత తదితర పనుల్లో గ్రామపంచాయతీ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం నిత్యం శ్రమిస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే కార్మికుల కుటుంబాలకు పండుగల సమయంలోనూ కనీస ఆర్థిక వెసులుబాటు లేకపోవడం ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు.కార్మికుల పేర్లు అంతర్జాలంలో నమోదు కాలేదనే సాంకేతిక కారణంతో వేతనాలు నిలిపివేయకుండా, వారు వాస్తవంగా విధులు నిర్వహిస్తున్నారో లేదో గ్రామపంచాయతీ రికార్డుల ఆధారంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. అర్హులైన కార్మికుల వివరాలను వెంటనే అంతర్జాలంలో నమోదు చేసి, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెలా వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని రాపర్తి రాజు డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.పెండింగ్ వేతనాల చెల్లింపు, అంతర్జాల నమోదు సమస్య పరిష్కారంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే వారి హక్కుల సాధన కోసం సంఘం ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామపంచాయతీ కార్మికుల సంఘం (సీఐటీయూ) జిల్లా, వివిధ మండలాల నాయకులు ఉమ్మగొని రాజేష్, పగిడిపల్లి మల్లేష్, ఎన్. రాజయ్య, యాకాసా జిల్లా ఉపాధ్యక్షులు గంగాపురం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జఫర్‌గఢ్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అట్ల బతుకమ్మ సంబరాలు



తెలుగు గళం న్యూస్ జఫర్‌గఢ్, అక్టోబర్ 15

జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అట్ల బతుకమ్మ సంబరాలను మహిళలు ఘనంగా నిర్వహించారు. ఐదవ రోజు బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి ఆర్యవైశ్య సంఘం వద్దకు తీసుకువచ్చారు.అనంతరం బతుకమ్మలను భక్తిశ్రద్ధలతో పూజించి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటాలు ఆడారు.ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఐకమత్యంతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. అట్ల బతుకమ్మ సందర్భంగా మహిళలు అట్లను వాయినంగా ఇచ్చిపుచ్చుకొని పండుగ ప్రత్యేకతను చాటుకున్నారు.ఈ సందర్భంగా అందంగా బతుకమ్మలను పేర్చిన మహిళలకు నిర్వాహకులు బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు అంచూరి యుగంధర్, దాంశెట్టి సోమన్న, ఇమ్మడి అశోక్, గందె సోమన్న, బెలిదె శ్రవణ్ కుమార్, అంచూరి సురేష్, బెలిదె హరిశంకర్, బజ్జూరి సుధీర్, ఇమ్మడి అనీల్, సంతోష్, మహిళా సంఘం ప్రతినిధులు అంచూరి కమల, దాంశెట్టి శ్రావ్య, దొడ్డ ఉమ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలి!

**- తక్కువ నీటితో పండే స్వల్పకాలిక పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి**
**- రైతులు ప్రభుత్వ సూచనలు పాటించాలి**
**- -- ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు**

తెలుగు ఏటూరునాగారం, అక్టోబర్ 15:



మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల ప్రకారం రైతులు రాబోయే యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని పంటల సాగుపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు సూచించారు. రాబోయే రోజుల్లో వర్షపాతం తగ్గి, భూగర్భ జలమట్టాలు పడిపోయే అవకాశం ఉన్నందున అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి తక్కువ నీటితో పండే స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'రైతు నేస్తం' 110వ ఎపిసోడ్‌లో యాసంగి సాగుపై రైతులకు అందించిన సూచనలను రైతులు పాటించాలని తెలిపారు. నీటి లభ్యత, నేల స్వభావాన్ని బట్టి వ్యవసాయ శాఖ అధికారుల సలహాలతో పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటి వనరులను సంరక్షించుకుంటూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని చిటమట రఘు కోరారు.

# గంజాయి అక్రమ రవాణాదారుడి అరెస్ట్: రేగొండ ఎస్సై సుధాకర్

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ




ఒడిశా నుంచి గంజాయిని అక్రమంగా తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని రేగొండ,సీసీఎస్ భూపాలపల్లి పోలీసులు సంయుక్తంగా అదుపులోకి తీసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు.ఎస్సై డి.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం...రేగొండ మండలం లింగాల గ్రామానికి చెందిన తిప్పారపు సందీప్ అలియాస్ వంశీ (23) ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా నాగులూరు ప్రాంతం నుంచి గంజాయిని తెచ్చి తెలంగాణలో అధిక ధరలకు విక్రయించి జల్సాలు చేసేవాడు.గత నెల 7వ తేదీన భూపాలపల్లికి చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1.190 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు,వారిచ్చిన సమాచారంతో మిగతా నిందితుల కోసం గాలింపు చేపట్టారు.ఈ కేసులో ఆరో నిందితుడైన సందీప్ పోలీసులకు భయపడి పరారీలో ఉంటూ,గురువారం స్వగ్రామం లింగాలకు వెళ్లేందుకు రేగొండకు చేరుకోగా పోలీసులు పట్టుకున్నారు.కేసులో ప్రమేయమున్న మిగతా నిందితులనూ త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్సై తెలిపారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,గంజాయి రవాణా,విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు

# గౌడ జాతి ఐక్యతతో ముందుకు సాగాలి

తెలుగు గళం న్యూస్ వరంగల్/అక్టోబర్ 15



తెలంగాణ గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ గౌడ్ వరంగల్ లోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గట్టు నరేష్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు కత్తి చిరంజీవి గౌడ్ ఆధ్వర్యంలో పల్లె లక్ష్మణ్ గౌడ్ ను శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా పల్లె లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ, గౌడ జాతి అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. గౌడులందరూ ఐక్యతతో ముందుకు సాగుతూ,హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పోరాటం చేయాలని, జాతి ఐక్యతను కాపాడుకుంటూ గౌడ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మూడం ప్రవీణ్, మూడం రాజేష్ తో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

# వెంకటాపురం తుడుందెబ్బలో మరో కమిటీ ఏర్పాటుపై అభ్యంతరం!

- ప్రస్తుత కమిటీ ఉండగానే కొత్త కమిటీ ఎందుకు? రాష్ట్ర నాయకత్వం స్పష్టత ఇవ్వాలి,
- తుడుందెబ్బలో కమిటీల వివాదం..
- బైలాకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి!
- తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు తుర్స చంటి దొర డిమాండ్




**తెలుగు గళం నూగూర్ వెంకటాపురం, అక్టోబర్ 15:**

వెంకటాపురం మండలంలో ఇప్పటికే కొనసాగుతున్న ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) మండల కమిటీ ఉండగానే మరో నూతన కమిటీ ఏర్పాటు చేయడంపై ప్రస్తుత కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సంఘం బైలాకు అనుగుణంగా ఈ వివాదంపై రాష్ట్ర నాయకత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. వెంకటాపురం మండల కేంద్రంలోని కొమరం భీమ్ విగ్రహం వద్ద తుడుందెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ సోడి శ్రీను అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర సమావేశంలో మండల అధ్యక్షుడు తుర్స చంటి దొర మాట్లాడుతూ, 2025 ఆగస్టు 4న ఏర్పాటు చేసిన ప్రస్తుత కమిటీకి రెండేళ్ల కాలపరిమితి ఉండగా, ముందస్తు సమాచారం లేకుండా మరో కమిటీని ఏర్పాటు చేయడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ జోక్యం చేసుకొని, ప్రస్తుత కమిటీ కొనసాగింపు, నూతన కమిటీ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఆదివాసీ హక్కుల సాధన కోసం నాయకులంతా ఐక్యంగా పనిచేయాలని, అంతర్గత విభేదాలు సంఘం ప్రతిష్ఠకు భంగం కలిగించకుండా రాష్ట్ర నాయకత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు పాయం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మిచ్చ సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సోడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తి నూతన ఎస్సైగా ఊర సృజన్ కుమార్ బాధ్యతల స్వీకరణ




**తెలుగు గళం న్యూస్ పాలకుర్తి అక్టోబర్ 15**

జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా ఊర సృజన్ కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు.పాలకుర్తి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు పోలీసు సేవలు అందుబాటులో ఉండేలా కృషి చేయాల్సిన బాధ్యత నూతన ఎస్సైపై ఉంది. ప్రజలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువచ్చి సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

# ఘనంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

- ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల ఆత్మీయ సమ్మేళనం
- ఐక్యత, ఆత్మీయతను చాటిన బతుకమ్మ వేడుకలు



**తెలుగు గళం ఏటూరునాగారం, అక్టోబర్ 15:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) ములుగు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని కొమరం భీం గ్రౌండ్ (జనజాతి స్టేడియం)లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక సోదరులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలు మహిళల ఆటపాటలు, బతుకమ్మల సందడితో ఆహ్లాదకరంగా సాగాయి. పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో పాల్గొన్న మహిళలు సంప్రదాయబద్ధంగా వేడుకలను నిర్వహించారు. పండుగ వాతావరణం అందరిలో ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక సోదరుల మధ్య పరస్పర స్నేహభావం, ఆత్మీయత, ఐక్యతను మరింత బలోపేతం చేయడమే ఈ ఆత్మీయ సమావేశం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగ వర్గాలందరూ పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ తమ హక్కుల సాధనకు ఐక్యంగా ఉండాలని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల ఐక్యతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. బతుకమ్మ సంబరాలతో పాటు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం ద్వారా అందరిలో సోదరభావం, ఐక్యతా స్ఫూర్తి వెల్లివిరిసింది. టీఎస్‌సీపీఎస్‌ఈయూ ములుగు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాల మధ్య ఆత్మీయ అనుబంధాన్ని పెంపొందిస్తూ ఉత్సాహంగా కొనసాగింది.

# బ్రెయిన్ స్ట్రోక్ తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నరుకుడు రవి

**దాతల సాయం కోసం భార్య వేడుకోలు**

**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/అక్టోబర్ 15**

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన నరుకుడు రవి బ్రెయిన్ స్ట్రోక్ కు గురై హన్మకొండలోని ఏకశిల ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ నెల 13న రక్తపోటు పెరగడంతో రవి బ్రెయిన్ స్ట్రోక్ కు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. చికిత్సకు లక్షల రూపాయలు ఖర్చవుతుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని భార్య నరుకుడు పూలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.తన భర్తకు ప్రాణదానం చేయడానికి దాతలు, దయ హృదయులు ముందుకు వచ్చి తోచిన ఆర్థిక సహాయం అందించాలని పూలమ్మ కన్నీటితో వేడుకున్నారు.దాతలు అందించే ప్రతి రూపాయి తమ కుటుంబానికి అండగా నిలుస్తుందని తెలిపారు.ఆర్థిక సహాయం పంపాల్సిన వివరాలు:



ఫోన్ పే / గూగుల్ పే నంబర్: 7989473913

పేరు: నరుకుడు రమేష్

గ్రామం: వడ్లకొండ

దాతలు పై నంబర్ కు తోచిన సహాయం పంపి రవి కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# పట్టభద్రుల ఓటర్లకు కీలక సూచన.. పాత ఓటర్లు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి!

**స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి, సహాయ ఓటరు నమోదు అధికారి ఎస్. కిరణ్ ప్రకాష్**

**ఫారం-18 సమర్పణకు నవంబర్ 6 చివరి గడువు.. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా**

**తెలుగు గళం న్యూస్, స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15**




తెలంగాణ రాష్ట్ర శాసనమండలిలోని మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్, వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల ఓటర్లకు అధికారులు కీలక సూచన చేశారు. 2027 మార్చిలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాల ఓటర్ల జాబితాలను కొత్తగా రూపొందిస్తున్నట్లు స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి, సహాయ ఓటరు నమోదు అధికారి ఎస్. కిరణ్ ప్రకాష్ తెలిపారు.భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 01.11.2026 అర్హత తేదీ ఆధారంగా ఓటర్ల జాబితాలను తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు.పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదు కావాలనుకునే వారు 31 అక్టోబర్ 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలని స్పష్టం చేశారు.

**పాత ఓటర్లు కూడా కొత్తగా దరఖాస్తు చేయాలి**

ప్రస్తుతం ఓటర్ల జాబితాలో పేరున్న వారు సైతం సవరించిన ఫారం-18 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి అని అధికారులు వెల్లడించారు. పాత జాబితాలో పేరు ఉన్నంత మాత్రాన ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హత నిర్ధారణ కాదని తెలిపారు. దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువీకరించిన పత్రాలు, విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాల ప్రతులను జతచేయాలని సూచించారు.దరఖాస్తులను తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ https://ceotelangana.nic.in ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. లేదా సంబంధిత ఓటరు నమోదు అధికారి, సహాయ ఓటరు నమోదు అధికారి, నియమిత అధికారులకు నేరుగా అందజేయవచ్చు. పోస్టు ద్వారా కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

**నవంబర్ 6 వరకు గడువు**

ఫారం-18 దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6 చివరి తేదీగా నిర్ణయించారు. నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, దావాలను స్వీకరిస్తారు.డిసెంబర్ 25 నాటికి అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను పూర్తి చేసి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు.పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటు హక్కు పొందేందుకు అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# రూ.11.50 లక్షల కరెన్సీ నోట్లతో కొలువుదీరిన మహాలక్ష్మి దేవి!

- ఏటూరునాగారం సాయిబాబా ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- అమ్మవారి 11 చీరలకు రూ.301తో లక్కీ డ్రా..



**తెలుగు గళం ఏటూరునాగారం, అక్టోబర్ 15:**

ఏటూరునాగారం శ్రీ సాయిబాబా ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ ఆధ్వర్యంలో రూ.11.50 లక్షల కరెన్సీ నోట్లతో తయారు చేసిన దండలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా, ఆ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అర్చకులు సూర్యం అయ్యగారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. ఉత్సవాలకు విచ్చేసిన భవాని మాలధారులు, భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిరోజూ మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అల్పాహారం అందిస్తున్నారు. అమ్మవారికి అలంకరించిన 11 చీరలను వేలం వేయకుండా, ఒక్కొక్కరికి రూ.301 చొప్పున లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు అందించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ నిర్ణయంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లక్కీ డ్రాలో పాల్గొనదలచిన భక్తులు ఆలయ కమిటీని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.సంప్రదించాల్సిన నంబర్: 9441304661 ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, సభ్యులు యాదగిరి, సతీష్, వెంకట్రావు, వేణుమాధవ్, నూతి ప్రణయ్, లక్ష్మణ్, తిరుపతి, భవాని మాలధారులు, ఇతర భక్తులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం

**-ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**తెలుగు గళం న్యూస్ హనుమకొండ/అక్టోబర్ 15**




వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డితో కలిసి వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల వ్యూహాలు, శ్రేణుల సమన్వయం, పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ విధానాలు, ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమం, యువత అభ్యున్నతి, విద్యావంతుల ఆకాంక్షల సాధనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేసే అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

నియోజకవర్గాల వారీగా నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి, పట్టభద్రులను నేరుగా కలిసి మద్దతు కూడగట్టాలని సూచించారు. సామాజిక మాధ్యమాల వేదికగా బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని,ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు, చైర్మన్లు, అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన చండిక అమ్మవారు



**తెలుగు గళం పాలకుర్తి, అక్టోబర్ 15**

జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్వయంభూ శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో చండిక అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చనతో పాటు చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి భాగం లక్ష్మీ ప్రసన్న, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# దసరా సందర్భంగా పేద మహిళలకు చీరల పంపిణీ

**తెలుగు గళం పాలకుర్తి అక్టోబర్ 15**



దసరా పండుగను పురస్కరించుకుని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని స్థానిక బీసీ హాస్టల్ వెనుక నివాసం ఉంటున్న సుమారు 15 మంది నిరుపేద మహిళలకు ట్రస్ట్ ప్రతినిధులు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ పండుగ వేళ నిరుపేద మహిళలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి తమ వంతు సహాయం అందించడంతో పాటు పండుగ సంతోషాలను వారితో పంచుకోవడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ట్రస్ట్ కోశాధికారి ఒర్రె కుమారస్వామి, ట్రస్ట్ ప్రతినిధి పల్లెపు శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతికి ప్రతీక తీజ్:టీఆర్పీ నాయకులు

**దూదేకులపల్లిలో ఘనంగా వేడుకలు**



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

గిరిజనుల విశిష్ట సంస్కృతి,ఆచార వ్యవహారాలు,ఐక్యతకు తీజ్ పండుగ నిదర్శనమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) నాయకులు పేర్కొన్నారు.భూపాలపల్లి రూరల్ మండల పరిధిలోని దూదేకులపల్లి గ్రామంలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో టీఆర్పీ నేతలు పాల్గొని గిరిజనులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆదేశాల మేరకు హాజరైన మండల అధ్యక్షుడు మీసాల రాజు,జిల్లా వ్యవసాయ విభాగం అధ్యక్షుడు పింగిడి శంకరయ్య మాట్లాడుతూ...తరతరాల సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.గిరిజన ప్రజల అభ్యున్నతికి,సంస్కృతీ పరిరక్షణకు టీఆర్పీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని,సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు లక్కాకుల రాకేష్,యువజన విభాగం ఉపాధ్యక్షుడు సుంకరి సందీప్,గ్రామ కమిటీ సభ్యులు,స్థానిక గిరిజన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.